

- కార్తీక మాసం కావడంతో భారీగా డిమాండ్
- అమాంతంగా పెరిగిన కూరగాయల ధరలు
- వరుస వర్షాలకు దెబ్బతిన్న కూరగాయల పంట

కూరలు కుతకుత



సిరిసిల్ల మార్కెట్‌లో కూరగాయల అమ్మకాలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

కార్తీక మాసంలో కూరగాయల సహజంగా పెరుగుదల కనిపిస్తుంది. దీనికి మొంథా తఫాన్ తోడు కావడంతో పది రోజుల్లోనే కూరగాయల ధరలు మూడింతల పెరిగాయి. కోడిమాంసం ధర తగ్గుతూ పెరుగుతుండగా, గుడ్డు ధర మాత్రం పెరిగింది. దీంతో కూరగాయలు కొనుగోలు చేయడానికి సామాన్య ప్రజలు ఇబ్బందులు ఇబ్బందిపడే పరిస్థితి వచ్చింది. ఏ కూరగాయ ధర చూసినా కిలో రూ 80 నుంచి రూ 200 వరకు ధర పలుకుతోంది. మొంథా తుఫాను ప్రభావంతో కూరగాయల పంటలు దెబ్బతిని ధరలు పెరుగుదలకు తోడుగా రాజన్న సిరిసిల్ల జిల్లాకు ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలను దిగుమతి చేసుకోవడంతో ధరలు పెరిగిపోయాయని వ్యాపారులు చెబుతున్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు పప్పుదినుసులతోనే సరిపెట్టుకునే పరిస్థితి ఏర్పడింది. సిరిసిల్ల జిల్లా కేంద్రానికి బోయిన్‌పల్లి, వేములవాడ, సిరిసిల్ల, తంగళ్లపల్లి, ఇల్లంతకుంట, మండలాలతో పాటు సిద్ధిపేట, జిల్లాల నుంచి కూరగాయలు అమ్మకానికి రైతులు తీసుకవస్తారు. దీనితో పాటు ఆంధ్రాలోని అనంతపూర్, కర్నూల్, మహారాష్ట్రలోని లాతురూ, నాందేడు, ఛత్తీస్‌గడ్ ప్రాంతాల నుంచి కూరగాయల దిగమతి చేసుకుంటున్నామని వ్యాపారులు తెలిపారు.

● ధరల పెరుగుదలతో అదనపు భారం..

జిల్లాలో కూరగాయల ధరల పెరుగుదలతో సామాన్య కుటుంబాలకు అదనపు భారంగా మారింది. ఒక కుటుంబానికి అదనంగా వెయ్యి రూపాయలపైనే భారం పడుతుంది. ఈ ఏడాది విభిన్నమైన వాతావరణ పరిస్థితులను రైతులు ఎదుర్కొంటున్నారు. ఖరీఫ్ ఆరంభంలో వర్షాలు సరిగా పడకపోవడంతో కూరగాయల పంటలు ఎండిపోవడంతో దిగుబడి తగ్గిపోయింది. తర్వాత ఆగస్టు మూడో వారం నుంచి తరచూ అల్పపీడన ప్రభావంతో వర్షాలు పడడంతో కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. సెప్టెంబరు లోను భారీగా వర్షాలు పడగా అక్టోబరులో మొంథా తుఫాన్ కూరగాయల రైతు లను మరింత కుంగదీసింది. కూర గాయల చేలల్లో ఎక్కువ రోజులు నీళ్ల నిల్వ ఉండడంతో మొక్కలు చనిపోయి దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. పది రోజుల్లోనే కూరగాయల ధరలు ఒక్కసారిగా మూడింతలు పెరిగాయి వారం రోజుల క్రితం కిలో రూ 20 ఉన్న టమాటా రూ40కి చేరింది. పచ్చిమిర్చి కిలో రూ80 ధర పలుకుతోంది. సొరకాయలు ఒకటి 40నుంచి రూ50 వరకు అమ్ముతున్నారు. ఆకుకూరల ధరలు మరింత పెరిగింది. పాలకూర కిలో రూ200 నుంచి రూ 250. మెంతికూర రూ 200, కొత్తిమీర రూ 150 ఇతర అన్ని ఆకుకూరలు రూ 100 నుంచి 120 వరకు అమ్ముతున్నారు. చిక్కుడుకాయ రూ 100, గోరు చిక్కుడు రూ 150, బీరకాయ రూ 120, కాకర రూ 80, దొండకాయ రూ 80, క్యారెట్ రూ 100, అలసంద రూ80, మునగకాయలు రూ 200, కాలీఫ్లవర్ రూ 80, వంకాయలు రూ 100, ఉల్లిగడ్డ రూ 40, బెండకాయలు రూ 80 బీట్రూట్ రూ 80 చేరుకుంది. కార్తీక మాసం కావడంతో ప్రతి ఇంట్లోనూ రోజూ పూజా కార్యక్రమాలతో పాటు కూరగాయల వంటలు చేసుకుంటారు. కార్తీకమాసం ఈనెల 19 వరకు ఉండడంతో కూరగాయల ధరలు ఇలాగే కొనసాగుతాయని వ్యాపారులు చెబుతున్నారు.

● వ్యాపారులకు ఇబ్బంది...

కూరగాయల ధరలు పెరగడంతో సిరిసిల్ల మార్కెట్‌లో వ్యాపారాలు తగ్గిపోయి చిరు వ్యాపారులకు ఇబ్బందులు తప్పడం లేదు. హోల్‌సేల్ వ్యాపారుల వద్ద కూరగాయలు కొనుగోలు చేసి అమ్ముకునే వ్యాపారులు ధరలు ఎక్కువగా ఉండడంతో కొనుగోలు జరగడం లేదని ఆందోళన చెందుతున్నారు. పెరిగిన ధరలతో కూరగాయల అమ్మకాలను కూడా తగ్గించుకోవాల్సి వస్తుందని పలువురు వ్యాపారులు తెలిపారు.

● కోడిగుడ్డు మరింత ప్రియం..

పేద కుటుంబాలు సైతం కోడిగుడ్డు కూరతో సరిపెట్టుకుంటారు. పదిహేను రోజులుగా కొడిగుడ్డు ధర ఒక్కసారిగా పెరిగిపోయింది. కార్తీక మాసంలో పూజల కారణంగా కొడిగుడ్డు ధర రూ 5 వరకే ఉండగా ప్రస్తుతం రూ 7 వరకు పెరిగింది. చలి కాలంలో ఇదే ధర ఉండే అవకాశం ఉంది. చికెన్ ధర కూడా పెరుగుతూ, తగ్గుతూ వస్తుంది. ప్రస్తుతం కిలో రూ 220 ఉంది. ధరల పెరుగుదలతో సామాన్యులు మాత్రం ఇబ్బందులు పడుతున్నారు.

తుఫాన్‌తోనే దిగుబడి పడిపోయింది..

- కూరపాటి శ్రీశైలం, అధ్యక్షుడు హోల్‌సెల్ కూరగాయల వ్యాపారుల సంఘం, సిరిసిల్ల



తుఫాన్ ప్రభావంతో కూరగాయల దిగుబడి తగ్గిపోయింది. రాజన్న సిరిసిల్ల జిల్లాకు ఇతర రాష్ట్రాల నుంచి కూరగాయలను తెప్పిస్తున్నాము. ఇతర రాష్ట్రాల నుంచి కూరగాయల రావడంతో రవాణా చార్జీల భారం కూడా పడుతుంది. దీంతోపాటు కార్తీక మాసం కావడంతో కూరగాయలకు డిమాండ్ పెరిగింది. మరో 10 రోజులపాటు కూరగాయల ధరలు పెరుగుదల ఉండే అవకాశం ఉంది.

మత్స్య కార్మికుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి



చెరువులో చేప పిల్లలను వదులుతున్న మత్స్య శాఖ జిల్లా అధికారి సౌజన్య, నాయకులు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మత్స్య కార్మికుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని మత్స్య శాఖ జిల్లా అధికారి సౌజన్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామ శివారులోని జక్కుల చెరువులో మత్స్య శాఖ ఆధ్వర్యంలో స్థానిక నాయకులు, మత్స్య కార్మిక సహకార సంఘాల ప్రతినిధులతో కలిసి ఆదివారం ఆమె ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అధికారి సౌజన్య మాట్లాడుతూ మత్స్య కార్మికుల సంక్షేమానికి సర్కారు పాటుపడుతోందన్నారు. మత్స్య కార్మికులు చేప పిల్లల పెంపకంతో ఉపాధి పొందాలన్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని 28, వీర్నపల్లి మండలంలోని 7 చెరువుల్లో 8,62,785 చేప పిల్లలను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో మత్స్యకారుల జిల్లా సంక్షేమ సంఘం అధ్యక్షుడు దేవదాస్, డైరెక్టర్ శివరామకృష్ణ, మత్స్యశాఖ అధికారులు కిరణ్, సతీష్, వెంకటేశ్, ఏఎంసీ వైస్‌చైర్మన్ రాంరెడ్డి, ఏజీపీ కృష్ణ, నాయకులు గౌస్, బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజ్‌కుమార్, పోచయ్య, శ్రీనివాస్, సుధాకర్, రమేశ్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల పట్టణ పద్మశాలి సంఘం ఎన్నికలు ప్రశాంతం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

సిరిసిల్ల టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణ పద్మశాలి సంఘం ఎన్నికలు ఆదివారం పోలీసుల బందోబస్తు మధ్య ప్రశాంతంగా ముగిశాయి. ఈ ఏడాది జూలై 21న పద్మశాలి కల్యాణ మండపంలో సిరిసిల్ల పట్టణ పద్మశాలి సంఘం ఎన్నికలను నిర్వహించగా అధ్యక్షుడు, ఉపాధ్యక్షులు-2, ప్రధాన కార్యదర్శి కోశాధికారి, సహాయ కార్యదర్శి, 33 వార్డు డైరెక్టర్ల పదవులకు 28 వార్డు డైరెక్టర్ల పదవులకు ఒక్కో నామినేషన్ రావడంతో ఎన్నికల అధికారి మామిడాల భూపతి అభ్యర్థులు ఏకగ్రీవం అయినట్లు ప్రకటించారు. దీంతో కొందరు ఎన్నికలను వ్యతిరేకిస్తూ కోర్టును ఆశ్రయించడంతో సిరిసిల్ల పట్టణ పద్మశాలి సంఘం ఎన్నిక నిలిచిపోయింది. కోర్టు పరిధిలో ఉండగానే ఆదివారం సిరిసిల్ల పట్టణ పద్మశాలి సంఘం ఐదు వార్డుల డైరెక్టర్ పదవులకు ఎన్నికల అధికారి ఎన్నికలను నిర్వహించారు. సంఘం 17వ వార్డు డైరెక్టర్‌గా వడ్లకొండ మధు, 20వ వార్డు డైరెక్టర్‌గా గోనె మల్లేశం, 22వ వార్డు డైరెక్టర్‌గా ఆడెపు కనకరాజు, 24వ వార్డు డైరెక్టర్‌గా అవదూత శ్రీహరి, 31వ వార్డు డైరెక్టర్‌గా పంతగాని శ్రీనివాస్ గెలుపొందారు. ఏకగ్రీవమైన సిరిసిల్ల పద్మశాలి సంఘం అధ్యక్షుడు దూడం శంకర్, ఉపాధ్యక్షులు మోర రవి, గాజుల బాలయ్య, ప్రధాన కార్యదర్శి మండల సత్యం, కోశాధికారి యెల్లె శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా కోడం శ్రీనివాస్‌తో పాటు మొత్తం 33 డైరెక్టర్లకు ఎన్నికల అధికారి మామిడాల భూపతి నియామక పత్రాలను అందజేసి సంఘం నూతన కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయించారు. ఎన్నికల అధికారులుగా ఆడెపు వేణు, పాశికంటి సతీష్ వ్యవహరించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని పూలమాలతో సభ్యులు సన్మానించారు.

కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

వేములవాడ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మార్క్సిస్టు విజ్ఞానవేత్త, స్త్రీ విముక్తి కార్యకర్త కామ్రేడ్ రంగవల్లి జ్ఞాపకార్థం నిర్మించిన రంగవల్లి విజ్ఞాన కేంద్రం ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కరపత్రాలను కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. వేములవాడ పట్టణంలోని నాంపల్లి నందికమాన్ సమీపంలో రంగవల్లి విజ్ఞాన కేంద్ర భవన్‌లో కమిటీ సభ్యులు హాజరై కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ రంగవల్లి భారత విప్లవోద్యమం అందించిన వీరనారీమణుల్లో ఒకరని గుర్తు చేశారు. రంగవల్లి వర్ధంతి, విజ్ఞాన కేంద్రం ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 11వ తేదిన విజ్ఞాన కేంద్రంలో సంక్షోభ కాలం- సామాజిక మార్పు, ప్రజా గ్రంథాలయాల ఆవశ్యకత అనే అంశాలపై రంగవల్లి స్మారకోత్సవాల ఉంటాయన్నారు. ఈకార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు రాజేశ్వరి, న్యాయవిద్యార్థి పోకల సాయికుమార్, చెన్నమనేని పురుషోత్తంరావు, ప్రజాసంఘాల నాయకులు లక్ష్మి, లత, అంజగౌడ్, నందం, దేవయ్య తదితరులు ఉన్నారు.

టీఆర్టీఎఫ్ మండల కార్యవర్గం





పోతుగంటి రమేష్, పెరుక వెంకటేశ్వరరావు

సిరిసిల్ల టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): టీఆర్టీఎఫ్ సిరిసిల్ల మండల శాఖ నూతన కార్యవర్గం ఆదివారం ఏకగ్రీవమైంది. అధ్యక్షుడిగా పోతుగంటి రమేష్, ప్రధాన కార్యదర్శిగా పెరుక వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ఏ వైదేహి, సామల రాములు, చెక్కిళ్ల శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర కౌన్సిలర్లుగా ఇప్పకాయల ప్రకాష్, కోటగిరి అంజనేయులు, మిట్టపల్లి వసంతను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కృష్ణప్రసాద్ మాట్లాడారు. ప్రభుత్వం సాధ్యమైనంత త్వరగా ఉద్యోగ, ఉపాధ్యయుల వేతన సవరణ నివేదికను తెప్పించుకొని పీఆర్సీని అమలుచేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ డీఏలు, మెడికల్ బిల్స్‌తోపాటు ఇతరత్రా ఏరియర్స్ బిల్స్‌ను విడుదల చేయాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వం ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డులను ఇవ్వాలన్నారు. టెట్ మినహాయింపు విషయంలో ప్రభుత్వం చొరవ తీసుకోవాలని, 2010కి ముందు నియామకమైన ఉపాధ్యాయులకు మినహాయించేలా కృషి చేయాలన్నారు. 190జీవోకు సంబంధించిన శాశ్వత ప్రతిపాదికను స్థానికత ఆధారంగా అందరినీ అడ్జెస్ట్ చేయాలని ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలుపుకోవాలన్నారు. నూతన కార్యవర్గం ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటాలు చేయాలని మండలంలో టీఆర్టీఎఫ్ అభివృద్ధికి కృషిచేయాలన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సభ్యులు పూలమాలలతో అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి బోయన్నగారి నారాయణ, జిల్లా నాయకులు గుగులోతు రమేష్‌నాయక్, పులి ప్రవీన్‌కుమార్, కోల వినయ్‌కుమార్, గాజెంగి విష్ణు, మామిడాల రమేష్, సుల్తాన్ రాజు, గోలి రాధకిషన్, బూట్ల శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజల హక్కుల పరిరక్షణకు కృషి

సిరిసిల్ల టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజల హక్కుల పరిరక్షణ నిరంతరం కృషి చేస్తామని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోసుకుల నాంపెల్లి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాంపెల్లి మాట్లాడారు. సమాచారం హక్కు చట్టం సాధన కమిటీ ఆవిర్భవించి సంవత్సరం పూర్తి అయ్యిందన్నారు. సాధన కమిటీ ప్రజల హక్కుల పరిరక్షణతోపాటు ప్రభుత్వ పారదర్శక పాలన కోసం కృషి చేస్తోందన్నారు. సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రజలకు కొన్ని అందని సేవలను వెలుగులోకి తీసుకొస్తుందన్నారు. ప్రజలకు పారదర్శకంగా సేవలనందించడంలో ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా కమిటీ నిలబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కుల చట్ట జిల్లా ఉపాధ్యక్షులు నర్సింగోజు శ్రీధర్, చందన భాస్కర్, వర్కింగ్ ప్రెసిడెంట్స్ కొల్లూరి సంతోష్, బైరి రాజశేఖర్, కార్యదర్శి పులి మధుకర్, సంయుక్త కార్యదర్శులు కంటె మల్లయ్య, గోనెల రాజు, పార్వతి ప్రశాంత్, బుర్ర సురేష్, రాగళ్ల రాజమౌళి, ముస్తాబాద్ మండల ప్రధాన కార్యదర్శి దొంతుల దినేష్, జిల్లా సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా పోరాటయోధులను ఆదర్శంగా తీసుకోవాలి

- సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్ - ఘనంగా చంద్ర పుల్లారెడ్డి వర్ధంతి



మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్



కళాకారుల ఆటాపాట..

సిరిసిల్ల టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజా పోరాటాలు చేసిన ప్రజా పోరాటయోధులను ఆదర్శంగా తీసుకొని విప్లవోద్యమంలో ఎర్రజెండా నీడలోకి అందరూ కలసిరావాలని సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏఐఎఫ్‌టీయూ (న్యూ) ఆధ్వర్యంలో చంద్ర పుల్లారెడ్డి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా జిల్లా కేంద్రం శాంతినగర్ చౌరస్తాలో సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం శాంతినగర్ చౌరస్తా నుంచి వరలక్ష్మి ఫంక్షన్ హాల్ వరకు కళాకారులు ఆటపాటల మధ్య ర్యాలీ నిర్వహించి అలరించారు. వరలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో ఏఐఎఫ్‌టీయూ(న్యూ) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోమిశెట్టి దశరథం అధ్యక్షతన చంద్ర పుల్లారెడ్డి వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ప్రసాద్ మాట్లాడారు. భూమి కోసం భుక్తి కోసం అమరులైన వీరులందరికి నివాళులర్పిస్తున్నామన్నారు. విద్యార్థి దశలోని చంద్ర పుల్లారెడ్డి విప్లవోద్యమానికి అంకితమైనాడన్నారు. గిరిజన ప్రజల కోసం ప్రజా పోరాటాలు ప్రతిఘటన పోరాటాలు చేసిన చంద్ర పుల్లారెడ్డి అడవి జీవితం, జైలు జీవితాలను గడి పాడన్నారు. ప్రజా పోరాటాలయోధుడు తుదిశ్వాస వరకు ప్రజల కోసం పోరాడిన మహోన్నతమైన విల్లవవీరుడు చంద్ర పుల్లారెడ్డిని మరవలేమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయూ(న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు మోడం మల్లేశం, కోశాధికారి బామండ్ల రవీందర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు వొల్లాల కిషోర్, రైతు కూలీ సంఘం జిల్లా కన్వీనర్ మచ్చ అనసూర్య, ఎర్ర జెండా బీడీ కార్మిక సంఘం పెద్దోళ్ల సంగీత, స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కార్యదర్శి మాసం అంజనేయులు, రైతు కూలీ సంఘం నాయకులు ఆనంద్, ఐలయ్య, ప్రసాద్, శ్రీహరి, కార్మికులు పాల్గొన్నారు.

చెత్త సేకరణపై చిత్తశుద్ధి ఏదీ?

- చెడిపోయిన రిక్షాలు, ఆటోరిక్షాలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



చిన్నబోనాలలో మూలనపడ్డ చెత్తను సేకరించే ఆటో




మూలనపడ్డ చెత్తను సేకరించే రిక్షాలు

సిరిసిల్ల రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో చెత్తసేకరణ కోసం లక్షల రూపాయలను పెట్టి కొనుగోలు చేసిన ఆటో రిక్షాలు చెడిపోయి మూలకు పడ్డాయి. వాటికి మరమ్మతులు చేయించకుండా మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంచేస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఏర్పాటు కాక ముందు ఉన్న సిరిసిల్ల మండలంలో ఉన్న గ్రామాల్లో చెత్తను సేకరించేందుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కరెంట్‌తో నడిచే ఆటో రిక్షాలను ప్రతి గ్రామపంచాయతీల నుంచి నిధులను సేకరించి అధికారులు కొనుగోలు చేసి అందించారు. అయితే సిరిసిల్ల మండలాన్ని విడదీసి అందులో ఉన్న ఏడు గ్రామాలను అర్బన్ మండలంగా ఏర్పాటుచేశారు. అయితే సిరిసిల్ల పట్టణానికి అనుకొని ఉన్న ఈ ఏడు గ్రామాలను సిరిసిల్ల మున్సిపాల్టీలో విలీనం చేశారు. దీంతో గ్రామపంచాయితీలుగా ఉన్న రగుడు, చంద్రంపేట, ముష్టిపల్లి, రాజీవ్‌నగర్, చిన్నబోనాల, పెద్దబోనాల, పెద్దూర్, సర్థాపూర్ గ్రామాలు వార్డులుగా మారిపోయాయి. అయితే గ్రామపంచాయతీలుగా ఉన్న సమయంలో లక్షలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన చెత్తను సేకరించే ఆటోరిక్షాలు చెడిపోవడంతో వాటిని మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ఆ రిక్షాలు పని చేయకపోవడంతో వాటిని వార్డు కార్యాలయాల్లోనే మూలన పడవేయడంతో రిక్షాలు వర్షాలకు తడుస్తూ, ఎండకు ఎండుతూ తుప్పు పట్టిపోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. అయితే మున్సిపల్ అధికారులు మాత్రం ఒక్కసారి గ్రామాల్లో చెత్తను సేకరించేందుకు ట్రాక్టర్‌లను పంపించి సేకరిస్తున్నారే తప్ప పనిచేసి చెడిపోయిన చెత్తను సేకరించే ఆటోరిక్షాలను బాగు చేయించడం లేదు. చెడిపోయిన చెత్త రిక్షాలను బాగు చేయించి వినియోగంలోకి తీసుకరావాలని కౌన్సిలర్‌లు మున్సిపల్ కమిషనర్‌తో పాటు చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకుండా పోయిందని తెలిపారు. ఇప్పటికైనా లక్షల రూపాయలతో కొనుగోలు చేసిన చెత్తరిక్షాలను కలెక్టర్ పరిశీలించి వాటికి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకరావాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు చేయించి వినియోగంలోకి తేవాలి

- నర్మెట ప్రభుదాస్, చంద్రంపేట



సిరిసిల్ల మున్సిపల్ విలీన గ్రామాల్లో చెత్తను సేకరించేందుకు లక్షలాది రూపాయలను వెచ్చించి కొనుగోలు చేసిన ఆటోరిక్షాలతో పాటు రిక్షాలు చెడిపోయినా అధికారులు మరమ్మతులు చేయించకపోవడంతో తుప్పుపట్టి పనికి రాకుండాపోతున్నాయి. కలెక్టర్ స్పందించి మూలనపడ్డ చెత్త సేకరించే రిక్షాలు, ఆటోరిక్షాలను పరిశీలించి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకరావాలి.

ఇవేం కష్టాలు.. రాజన్నా..?

- అడుగడుగునా భక్తుల ఇక్కట్లు - పూజలు, మొక్కులకు తికమక



బారులుతీరిన భక్తులు

6

దయనీయ స్థితిలో 'సినారె కళామందిర్'

- మందుబాబులకు అడ్డాగా మారిన వైనం



సినారె కళామందిర్ ఎదుట పేరుకుపోయిన చెత్త

7

రేపాకలో బ్లాక్‌లెవల్ క్రీడా పోటీలు ప్రారంభం

ఇల్లంతకుంట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేపాక గ్రామంలో బ్లాక్‌లెవల్ క్రీడాపోటీలు ఆదివారం ప్రారంభం అయ్యాయి. మైభారత్, రేపాక స్పోర్ట్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరిగే పోటీలలో పలు గ్రామాల క్రీడాకారులు పాల్గొన్నారు. కబడ్డీ, వాలీబాల్, రన్నింగ్, బ్యాడ్మింటన్, చెస్, రన్నింగ్, షార్ట్‌పుట్ విభాగాల్లో పోటీలు ప్రారంభం అయ్యాయి. కార్యక్రమంలో జిల్లా మైభారత్ కార్యదర్శి సాయి, మహమ్మద్ అశు, మహేష్‌లతో పాటు గ్రామస్తులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



కబడ్డీ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి


చంద్రమౌళి

ముత్తారం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశనపల్లి గ్రామానికి చెందిన కలవేన చంద్రమౌళి(48) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. శుక్రవారం సాయంత్రం పని నిమిత్తం ముత్తారం వెళ్లి వస్తుండగా కేశనపల్లి గ్రామపంచాయతీ సమీపంలోని మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి కింద పడిపోయాడు. దీంతో అతని తలకు తీవ్రగాయమైంది. కుటుంబ సభ్యులు వెంటనే చంద్రమౌళిని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి, ఆదివారం ఉదయం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వీణవంక, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లూరు మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు ఆదివారం పట్టుకున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ట్రాక్టర్ యాజమానులు పల్లపు వెంకట్, పల్లపు రాజయ్యపై కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.

మానకొండూర్: మండలంలోని ఊటూర్ మానేరు వాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను పచ్చునూర్‌లో పట్టుకున్నట్లు స్థానిక సీఐ సంజీవ్ తెలిపారు. మానేరు వాగు నుంచి శనివారం రాత్రి కరీంనగర్ తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

తండ్రిపై కొడుకు దాడి

మెట్‌పల్లి టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తండ్రిపై కొడుకు దాడి చేసిన ఘటన పట్టణంలో ఆదివారం చోటు చేసుకుంది. పట్టణంలోని బోయవాడలో ఎల్లా గంగానర్సయ్యపై అతని కొడుకు అన్వేష్ కర్రతో దాడి చేశాడు. దాడిలో నర్సయ్యకు తీవ్ర గాయాలు కావడంతో అతన్ని స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. దాడికి గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ముత్తారం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖమ్మంపల్లి గ్రామశివారులో శనివారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఖమ్మంపల్లి నుంచి అర్ధరాత్రి ఇసుక కోసం వెళ్తున్న ట్రాక్టర్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా తాడిచర్ల నుంచి వస్తున్న బైక్ ఢీకొన్నాయి. ఇందులో బైక్‌పై ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం మంథని ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి కరీంనగర్‌కు తరలించారు.

ఇవేం కష్టాలు రాజన్నా..


తూర్పు ద్వారం వద్ద భక్తుల రద్దీ

- అడుగడుగునా భక్తుల ఇక్కట్లు
- పూజలు, మొక్కులకు తికమక

వేములవాడ టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం సందర్భంగా రాజన్న దర్శనానికి వచ్చిన భక్తుల కష్టాలు చెప్పనలవికాదు. ఆదివారం రాజన్న దర్శనానికి వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. ఇటు రాజన్న, అటు భీమన్న సన్నిధిలో భక్తులు దర్శించుకోవాల్సి రావడంతో తికమకపడ్డారు. ఏ పూజలు ఎక్కడ చేయాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. వివిధ ప్రాంతాల నుంచి వేములవాడకు చేరుకున్న భక్తులు ఎటువైపు వెళ్లాలో తెలియక ఇబ్బందులు పడ్డారు. కోరిన కోర్కెలు తీరాలంటూ మొక్కులు చెల్లించుకున్న భక్తులకు కష్టాలు తప్పడంలేదు. రాజరాజేశ్వరస్వామివారి దర్శనానికి రాజగోపురం నుంచి ప్రవేశం కల్పించారు. స్వామి వారిని సాధారణ(లఘు)దర్శనమే చేసుకోవడానికి గంటల తరబడి క్యూలైన్‌లో వేచి ఉండక తప్పలేదు.


ఆలయ ప్రధాన ద్వారం వద్ద రద్దీగా ఉన్న భక్తులు

రద్దీ అధికంగా ఉండడంతో ఒకే మార్గం నుంచి అనుమతి ఇవ్వడంతో ఇబ్బందులు ఎదుర య్యాయి. రాజగోపురం ఎదురుగా ఉన్న రావి చెట్టుకు ఇరు వైపులా భక్తులు లోనికి వెళ్లేందుకు ప్రయత్నించారు. మరోవైపు తూర్పు వైపు ఉన్న క్యూలైన్‌లోనూ స్వామివారి దర్శనానికి బారులు తీరారు. రాజగోపురం ఎదురుగా బారికేడ్లు తాళం వేసి ఉన్నప్పటికీ భక్తులు స్వామివారి దర్శనానికి నిరీక్షించడంతో ఒక్కసారిగా తోయడం వల్ల గేటు ఊడిపోయింది. ఇకపోతే భీమేశ్వరాలయం వద్ద భక్తులు ఇక్కట్లు నెలకొన్నాయి. ఆర్జిత సేవల టికెట్లు తీసుకునేందుకు ఎటు వెళ్లాలో తెలియని పరిస్థితి నెలకొంది. బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించడం భక్తులకు గగనమైంది. బోనం సమర్పించేందుకు గంటల తరబడి నిరీక్షణ తప్పడంలేదు.

తగ్గిన కల్యాణం టికెట్లు సంఖ్య..

రాజరాజేశ్వరస్వామి ఆలయ విస్తరణ పనుల నేపథ్యంలో స్వామివారి లఘు దర్శనం మాత్రమే కల్పించి భీమేశ్వరాలయంలో ఆర్జిత సేవలకు అవకాశం కల్పించారు. దీంతో అంతకుముందు నిత్య కల్యాణానికి ప్రతిరోజు 150, సత్యనారాయణ వ్రతా లకు 100 టికెట్లు ఇచ్చేది. ప్రస్తుతం అన్నదాన స త్రంపై అంతస్థులో నిత్యకల్యాణం, సత్యనారాయణ వ్రతాలు నిర్వహించడంతో హాలు ఇరుకుగా ఉంది. దీంతో కేవలం 70 నిత్యకల్యాణం, 50 సత్యనారా యణ వ్రతాల టికెట్లు విడుదలకు కుదించారు. మిగి తా భక్తులు కళ్యాణం, సత్యనారాయణ వ్రతాలు చేసుకోలేక తిరుగుముఖం పడుతున్నారు. ఆదివారం 69మంది దంపతులు కల్యాణం, 32మంది దంప తులు సత్యనారాయణ వ్రతాలు చేసుకున్నారు. ఆ ర్జిత సేవలైన కల్యాణం, సత్యనారాయణ వ్రతాల టికె ట్లు తగ్గించడంతో భక్తులకు తిప్పలు తప్పడంలేదు.


కల్యాణం జరిగే హాలులో స్థలం లేక బయట ఉన్న భక్తులు

హెల్ప్‌డెస్క్ ఎక్కడ?

రాజన్న సన్నిధిలో విస్తరణ పనుల నేపథ్యంలో ఆర్జిత పూజలు భీమేశ్వరాలయానికి మార్చిన సందర్భంగా హెల్ప్‌డెస్క్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఇంతకు ముందు ఆర్జిత సేవలన్నీ రాజన్న ఆలయంలో జరిగినందున భక్తులకు యథావిధిగా ఎక్కడ ఏ మొక్కులు చెల్లించాలో తెలిసేది. ప్రస్తుతం ఆర్జిత పూజలు, కోడెల మొ క్కులు భీమన్న ఆలయానికి మారినపుడే రాజన్న ఆలయం వద్ద, భీమన్న ఆలయం వద్ద హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాల్సి ఉంది. ఏ పూజలు ఎక్కడ జరు గుతాయని, ఏ పూజకు టికెట ధర ఎంత తదితర సమాచారం తెలిసేందుకు వీలుగా పలుచోట్ల హెల్ప్‌డెస్క్ ఉంటే భక్తులకు సౌకర్యంగా ఉంటుంది.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

- గుంత తీస్తుండగా విద్యుదాఘాతంతో ఒకరి మృతి

బీర్‌పూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలోని కండ్లపల్లి గ్రామంలో శనివారం రాత్రి గుప్త నిధుల తవ్వకాలు ఓ నిండు ప్రాణాన్ని బలిగొన్నాయి. నిధులను వెలికి తీసేందుకు ఓ ఇంటిలో గుంత తవ్వుతుండగా ప్రమాదవశత్తు విద్యుదాఘాతంతో నారవేణి మొగిళి(51) అనే వ్యక్తి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జగిత్యాల రూరల్ సీఐ సుధాకర్, బీర్‌పూర్ ఎస్సై రాజు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. బీర్‌పూర్ మండలంలోని కండ్లపల్లి గ్రామానికి చెందిన శ్రీరాముల నవత-మల్లేశ్ దంపతులు తమ ఇంట్లో గుప్త నిధులు ఉన్నాయని, వాటిని తీయాలని అనంతారం గ్రామానికి చెందిన నారవేణి మొగిళి(51), గోవింద్‌పల్లె గ్రామానికి చెందిన వరికొప్పుల సోమయ్య, దమ్మన్నపేట గ్రామానికి చెందిన బైరవేణి రాజును కోరారు. శనివారం రాత్రి ముగ్గురు వ్యక్తులు నవత ఇంట్లో సుమారు ఎనిమిది ఫీట్ల లోతు గల గుంతను తీశారు. ఏమీ లభించకపోవడంతో గుంత నుంచి పైకి ఎక్కే క్రమంలో నారవేణి మొగిళి చెయ్యి కరెంటు బోర్డుకు అమర్చిన ఫ్యూజు వైరుకు తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. మొగిళిని అంబులెన్స్‌లో జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మొగిళి భార్య నారవేణి లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు జగిత్యాల రూరల్ సీఐ సుధాకర్ తెలిపారు.


గుప్త నిధుల కోసం తవ్విన గొయ్యి

విద్యుదాఘాతంతో ఆవు మృతి

బోయినపల్లి నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బోయినిపల్లి మండలం స్తంభంపల్లిలో విద్యుదాఘాతంతో ఆవు మృతిచెందింది. స్తంభంపల్లి గ్రామంలోని ముత్యపు పరశురాం అనే రైతుకు చెందిన ఆవు వ్యవసాయ పొలంలో ఇనుప స్తంభానికి తగలడంతో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందింది. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం మూలంగానే ఆవు మృతి చెందిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఆవు మృతితో రైతుకు నష్టం వాటిల్లిందని, బాధితుడికి ప్రభుత్వం ఆర్థికం గా ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.


విద్యుదాఘాతంతో మృతిచెందిన ఆవు

బైక్ అదుపుతప్పి చెట్టుకు ఢీ

- ఇద్దరు పాలిటెక్నిక్ విద్యార్థుల దుర్మరణం


మణిచరణ్ , శశికుమార్ (ఫైల్)

వేములవాడ టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బైక్ అదుపుతప్పి చెట్టుకు ఢీకొనడంతో ఇద్దరు విద్యార్థులు దుర్మరణం చెందారు. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం... వేములవాడ అర్బన్ మండలంలోని అగ్రహారం వద్ద ఆదివారం అతివేగంగా వస్తున్న ద్విచక్రవాహనం చెట్టుకు ఢీకొంది. ఈ ప్రమాదంలో అగ్రహారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా చదువుతున్న ఇద్దరు విద్యార్థులు మృతిచెందారు. జగిత్యాల జిల్లా మేడిపల్లి మండల కేంద్రానికి చెందిన కుడికందుల రవీందర్ ఏకైక కుమారుడు మణిచరణ్ (18) అక్కడికక్కడే మృతిచెందగా, సిరిసిల్ల పట్టణం రగుడు గ్రామానికి చెందిన బూర లక్ష్మి, భూమయ్యల ఏకైక కుమారుడు శశికుమార్(18) తీవ్రగాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. అగ్రహారంలో అద్దెకు ఉంటున్న మణిచరణ్ సెలవురోజు కావడంతో సిరిసిల్ల పట్టణం రగుడులో ఉండే తన స్నేహితుడైన శశికుమార్ వద్దకు వెళ్లాడు. ద్విచక్రవాహనంపై ఇద్దరు స్నేహితులు కళాశాల వైపు అతివేగంగా వస్తుండగా బైక్ అదుపు తప్పి చెట్టుకు ఢీకొంది. ఈ ప్రమాదంలో కుడికందుల మణిచరణ్ అక్కడికక్కడే మృతిచెందగా, బూర శశికుమార్‌కు తీవ్రగాయాలు కావడంతో చికిత్స కోసం కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. అగ్రహారం రాజరాజేశ్వర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మణిచరణ్ డిప్లొమా ద్వితీయ సంవత్సరం, శశికుమార్ డిప్లొమా మొదటి సంవత్సరం చదవి డిటెండ్ అయ్యాడు. ఇద్దరు స్నేహితులు మృతిచెందడంతో రెండు కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇద్దరు కుటుంబంలో ఏకైక కుమారులే కావడంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని మృతదేహాలను పోస్టుమార్టం తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలి మృతి

హుజూరాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అనుమానాస్పద స్థితిలో ఓ వృద్ధురాలు మృతి చెందింది. పట్టణంలోని ప్రతాపవాడకు చెందిన పంపిరి పద్మ (70) అనే వృద్ధురాలు అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. ఆమె భర్త ఎక్సైజ్ శాఖలో ఉద్యోగం చేసి మృతి చెందగా, కొడుకు, కూతురు ఉన్నారు. ఆదివారం కరెంటు బిల్లు కొట్టేందుకు వచ్చిన ట్రాన్స్‌కో ఉద్యోగికి ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో చుట్టూ పక్కల వారికి విషయం తెలిపాడు. స్థానికులు తలుపులు తెరిచి చూడగా వృద్ధురాలి మృతదేహం కనిపించింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కొడుకుకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. కూతురుకు సమాచారం అందించారు. కాగా వృద్ధురాలు మృతికి గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత



బాలుడిని కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు

మల్యాల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి దర్శనానికి వచ్చిన ఓ బాలుడు తప్పిపోగా పోలీసులు వెతికి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన కిషోర్‌కుమార్ కుటుంబ సమేతంగా ఆదివారం అంజనేయస్వామి దర్శనానికి వచ్చారు. దర్శనం చేసుకునే సమయంలో వారి రెండున్నరేళ్ల కుమారుడు హరినాథ్ తప్పిపోయాడు. దీంతో బాలుడి తల్లిదండ్రులు స్థానిక అవుట్‌పోస్టు పోలీసులకు సమాచారం అందించారు. బాలుడిని వెతికి పట్టుకొని మైక్ ద్వారా అనౌన్స్ చేసి విచారణ జరిపిన అనంతరం ఏఎస్సై చిలుక శ్రీనివాస్ బాలుడి తల్లిదండ్రులకు అప్పగించారు.

వసతి గృహం పరిసరాల్లో ఎలుగుబంటి సంచారం

ఇల్లంతకుంట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గాలిపెల్లి గ్రామంలోని ఎస్సీ బాలుర వసతిగృహ పరిసరాల్లో ఎలుగుబంటి సంచరించింది. హాస్టల్ సమీపంలో పత్తిచేన్లు ఉండటం పక్కనే బైపాస్ రోడ్డు ఉంది. రోడ్డు వెంబట ఆదివారం ద్విచక్రవాహనంపై ఇరువురు వస్తుండగా ఎలుగుబంటి రోడ్డు పక్కనే కనిపించింది. గ్రామస్థులకు సమాచారం అందివ్వగా తాటికమ్మలను అంటుబెట్టుకొని వెళ్లగా పత్తిలోకి ఎలుగుబంటి పరుగులు తీసింది. రెండు సంవత్సరాలుగా గాలిపెల్లి, పారువెల్ల గ్రామాల పరిసరాల్లో ఎలుగుబంటి తిరుగుతోందని, అటవీశాఖ అధికారులు స్పందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

యువకుడి ఆత్మహత్య


వెంకటేశ్(ఫైల్)

తంగళ్లపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం గోపాల్‌రావ్‌పల్లె గ్రామానికి చెందిన ఎడ్ల వెంకటేష్(23) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంధువుల కథనం.. గ్రామానికి చెందిన వెంకటేష్ కొద్ది రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. చికిత్స చేయించుకున్నప్పటికీ తిరిగి అనారోగ్యానికి గురికావడంతో శనివారం అర్ధరాత్రి ఇంట్లోని బాత్‌రూంలో పరుగుల మందు తాగాడు. గమనించిన తల్లి వసంత, బంధువులు వెంకటేశ్‌ను జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తుండగా ఆదివారం మృతిచెందాడు. మృతుడు ఎంబీఏ పూర్తి చేసి వ్యవసాయ పనులు చేసుకుంటూ పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్నాడు. ఈ క్రమంలో అనారోగ్యానికి గురి కావడంతో మనస్థాపంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు.

కొండచిలువ హతం



బోయినపల్లి నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): బోయినిపల్లి మండలం రత్నంపేట గ్రామంలో ఆదివారం కొండచిలువ ప్రత్యక్షమై కలకలం సృష్టించింది. గొర్రెలను మేపేందుకు పచ్చిగడ్డి కోసం వెళ్లగా కొండచిలువ రావడంతో ఒక్కసారిగా భయభ్రాంతులకు గురై పరుగులు తీశారు. దీంతో గొర్రెల కాపరులు కొండచిలువను చంపి వేశారు.

రేకులు మీదపడి వృద్ధురాలి మృతి


అంతగిరి లక్ష్మి(ఫైల్)

ఓదెల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలనూర్‌లో ఆదివారం అంతగిరి లక్ష్మి(65) అనే వృద్ధురాలు రేకులు మీద పడి మృతిచెందింది. పాతభవనం ముందు సజ్జలపై నుండి నీడ కోసం రేకులు అమర్చుకున్నారు. ఇంటిముందు లక్ష్మి కూర్చున్న సమయంలో అకస్మాత్తుగా సజ్జలు విరగడంతో రేకులు మీదపడి వృద్ధురాలు అక్కడికక్కడే మృతిచెందింది. ఈ మేరకు మృతురాలి కుమారుడు సదయ్య అలియాస్ బుచ్చిమల్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పొత్కపల్లి ఎస్ఐ దీకొండ రమేష్ తెలిపారు.

రంగరావుపేటలో సీసీఎమ్‌బీ శాస్త్రవేత్తల పర్యటన

మెట్‌పల్లి రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రంగరావుపేట గ్రామంలో సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యూలర్ బయాలజీ హైదరాబాద్ శాస్త్రవేత్తలు ఆదివారం పర్యటించి పాముకాటుతో మరణించిన వారి వివరాలను సేకరించారు. గ్రామంలో ఇదివరకు పాము కాటు గురై మృతి చెందిన వివరాలతో పాటు ఆరోగ్య సమస్యల గురించి మండల వైద్యాధికారి అంజిత్‌రెడ్డితో కలిసి వారి ఇంటికి వెళ్లి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాము కాటేయగానే చాలా మంది కంగారు పడతారని అలా చేయడం వలన భయం ఎక్కువై గుండె వేగంగా కొట్టుకొని విషం శరీంలో త్వరగా పాకే అవకాశం ఉంటుందన్నారు. బాధి తుడు ప్రశాంతంగా ఉండి కాటు వేసిన పామును గుర్తించి అది ఏ రంగులో ఉంది, సైజు, తల అకారం లాంటివి గమనించి వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లాలని తెలిపారు. విషం శరీరంలో వేగంగా పాకకుండా ఉండాలంటే కాటు వేసిన భాగాన్ని స్థిరంగా ఉంచాలన్నారు. డాక్టర్లకు పాము గురించి తెలిపితే వారు త్వరగా ట్రీట్‌మెంట్ చేయడానికి వీలు ఉంటుందని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి అంజిత్‌రెడ్డి, సీసీఎమ్ బీ చీఫ్ సైంటిస్టులు కార్తికేయన్, సుమిత్, బృందం శ్రీనివాస్, స్వప్నిల్, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.



పాము కాటు వివరాలు సేకరిస్తున్న సీసీఎమ్‌బీ శాస్త్రవేత్తలు

మట్టి తవ్వకాన్ని అడ్డుకున్న గ్రామస్థులు


కేశవపట్నంలో ట్రాక్టర్లలో తరలిస్తున్న మట్టి

శంకరపట్నం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కేశవపట్నం శివారులో అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిని రైతులు అడ్డుకున్నారు. గ్రామస్థుల వివరాల మేరకు ఇటీవల కురిసిన అకాల వర్షాలకు సైదాపూర్ మండలంలో ధ్వంసమైన రోడ్లను మరమ్మతు చేయడానికి కేశవపట్నం శివారులోని మంగల్ మెట్టు వద్ద ఎక్స్‌కావేటర్ సహాయంతో కాంట్రాక్టర్ మట్టి తరలిస్తున్నాడు. విషయం తెలిసిన గ్రామస్థులు అడ్డుకున్నారు. మట్టి తవ్వకంపై వివరణ అడగడానికి వెళ్లగా ఆర్‌అండ్‌బీ వర్క్ ఇన్‌స్పెక్టర్ కాంట్రాక్టర్ మట్టి తవ్వకాలు నిలిపివేసి వెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు.

తేజస్ అకాడమీలో అగ్నిప్రమాదం


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

కరీంనగర్ క్రైం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి తేజస్ అకాడమీలో ఆదివారం అగ్నిప్రమాదం జరిగి రెండు కుర్చీలు కాలిపోయాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అకాడమీలోని కార్యాలయం గదిలో మంటలు అంటుకోగా సిబ్బంది వెంటనే సమాచారం అందించటంతో కరీంనగర్ అగ్నిమపకశాఖ స్పందించి ఫైరింజన్‌తో సంఘటనాస్థలానికి చేరుకుని మంటాలను అదుపులోకి తీసుకు వచ్చింది. ఈ ప్రమాదంలో స్వల్పంగా నష్టం జరిగిందని జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి ఎం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

చంద్రంపేట చౌరస్తాలో తృటిలో తప్పిన ప్రమాదం

సిరిసిల్ల రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చంద్రంపేట చౌరస్తాలో శనివారం అర్ధరాత్రి ఓ కారు అదుపుతప్పి గుంతలో పడి డివైడర్‌ను ఢీకొట్టడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. చంద్రంపేట శివారులో ఉన్న కల్యాణ మండపంలో పట్టణానికి చెందిన వ్యాపారి కుమార్తె వివాహం జరిగింది. ఆ వివాహానికి సంబంధించిన కారులో సామగ్రిని ఇంటికి తరలిస్తుండగా చంద్రంపేట చౌరస్తాలో ప్రమాదకరంగా ఉన్న గుంతను గమనించకపోవడంతో కారు అందులో పడి అదుపుతప్పి పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొంది. ఆదివారం ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ప్రమాదానికి గురైన కారును తొలగించారు.


సిరిసిల్ల చంద్రంపేటలో ప్రమాదానికి గురైన కారు

బైక్‌పై నుంచి కింద పడి మహిళకు గాయాలు

- పోలీసుల నుంచి తప్పించుకునే క్రమంలో ఘటన

చందుర్తి నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బైక్‌పై నుంచి ఓ మహిళ కింద పడి గాయాలైన సంఘటన చందుర్తి మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం కథలాపూర్ మండలం బొమ్మెన గ్రామానికి చెందిన లంకదాసరి దేవదాసు అనే వ్యక్తి తన భార్య లక్ష్మి, బంధువులు కలిసి వేములవాడకు వెళ్లి తిరిగి కోరుట్లకు వెళ్తున్నాడు. దేవదాసు దివ్యాంగుడు కావడంతో అతను ఒక్కడే తన వాహనంపై వెళ్తూ బంధువులకు చెందిన మరో బైక్‌పై తన భార్య లక్ష్మి వెళ్తుతున్నది. చందుర్తిలో పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా వాహనాన్ని ఆపినట్లు ఆపి, బైక్‌ను ఒక్కసారిగా ముందుకు కదిలించడంతో అదుపు తప్పి మహిళ కింద పడింది. దీంతో ముందు వెళ్లిన భర్త తిరిగి వచ్చి పోలీసులు పడగొట్టారని గొడవకు దిగడంతో అక్కడున్న వారు ద్విచక్ర వాహనదారుని తప్పని అని చెప్పడంతో, లక్ష్మిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో వేములవాడ ఏరియా అసుపత్రికి తరలించారు. ఈ విషయమై ఎస్సై రమేష్‌ను వివరణ కోరగా పోలీసుల తనిఖీల నుంచి తప్పించుకోవడానికి బైకును ఒక్కసారిగా రోడ్డుకు కిందకు దించి వెళ్లే క్రమంలో వెనుక కూర్చున్న మహిళ అదుపు తప్పి కింద పడిపోయిందని తెలిపారు. పోలీసులు వాహనాన్ని కూడా ఆపలేదన్నారు.

ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్

గంగాధర, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గంగాధరలో ఉమ్మడి జిల్లా స్థాయి వీకెండ్ ఒపెన్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ప్రారంభమైంది. ఈ టోర్నమెంట్‌లో 8 ప్రాంచైజీ జట్లు పాల్గొంటున్నట్లు నిర్వహకుడు రాగూర్ తెలిపారు. ఆదివారం జరిగిన ప్రారంభ మ్యాచ్‌లో రాయల్ వేములవాడ జట్టు సుప్రాక్రికెట్ ఆకడమీ జూనియర్స్‌పై 170 పరుగులతో గెలుపొందింది. ఈ టోర్నమెంటును మాజీ ఎంపీపీ శ్రీరాం మధుకర్, సింగిల్ విండో ఉపాధ్యక్షుడు వేముల భాస్కర్, మాజీ సర్పంచ్ వేముల లావణ్య అంజి, గంగాధర క్రికెట్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రాజన్న సన్నిధిలో శిథిలాల తొలగింపు



వేములవాడలో శిథిలాలను తొలగిస్తున్న ఎక్స్‌కావేటర్

వేములవాడ టౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో విస్తరణ పనుల నేపథ్యంలో కూల్చివేసిన పాత భవనాల శిథిలాల తొలగింపు ప్రక్రియ మొదలైంది. ఆదివారం ఆలయం వద్ద రెండు ఎక్స్‌కవేటర్లను ఏర్పాటు చేసి శిథిలాలను తరలిస్తున్నారు. రాజన్న సన్నిధిలో రూ. 76కోట్లతో విస్తరించేందుకు అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది. ఇందుకు గతంలో ఉన్న పాత భవనాలైన కళాభవన్, పరిపాలన భవన్, వంతెనలు కూల్చివేశారు. ఈ కూల్చివేసిన సందర్భంగా ఏర్పడిన శిథిలాలన్నీ తొలగించేందుకు పనులు వేగవంతం చేశారు. ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో రావడంతో కొంత ఇబ్బందులు నెలకొన్నాయి.

తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక

కరీంనగర్‌టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం నగరంలోని సంఘం భవనంలో రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకన్న ఆదేశాల మేరకు బొద్దుల గంగయ్య ఎన్నికల అధికారిగా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లా సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిందం శ్రీనివాస్, సహాధ్యక్షులుగా దీకొండ భూమయ్య, వొడ్నాల చంద్రమౌళి, ఉపాధ్యక్షులుగా మిట్టపల్లి రాజేంద్రప్రసాద్, దూస రాజశేఖర్, ఆడెపు రాజేంద్రప్రసాద్, దాసరి రాజమల్లు, కొలిపాక కావ్య, ప్రధాన కార్యదర్శిగా వంగ రవీందర్, కోశాధికారిగా మంచికట్ల రవి, సంయుక్త కార్యదర్శులుగా డాక్టర్ వేముల జమున, జల్దా భూమేశ్వర్, గట్టు రమేష్, కొండ వెంకటరాజం, సంస్థాగత కార్యదర్శిగా కూరపాటి వెంకటరమణ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి గంగయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

కార్యనిర్వాహక కార్యదర్శులుగా గుండెల్లి లక్ష్మీనర్సయ్య, మేర్గు వెంకటరమణ, గుడ్ల మమత, ప్రచార కార్యదర్శులుగా బాషబత్తిని కుమార స్వామి, దూసశ్రీనివాస్, ఆఫీస్ కార్యదర్శి దిడ్డి ప్రదీప్, కార్యవర్గసభ్యులుగా వెంగల రవీంద్రనాథ్, గూడూరి రాజు, బైరి మార్కండేయ, గడ్డం బుచ్చన్న, చిమ్మని చంద్రశేఖర్, చిలుక మనోహర్‌ను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

- మందుబాబులకు అడ్డాగా మారిన వైనం
- ప్రభుత్వం స్పందించాలని కళాకారుల విజ్ఞప్తి



వేములవాడలో కళావిహీనంగా మారిన సినారె భవన్

దయనీయ స్థితిలో 'సినారె' కళామందిర్

వేములవాడ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మూలవాగు ఖ్యాతిని చాటిచెప్పిన జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సింగిరెడ్డి నారాయణరెడ్డి (సినారె) తగినంత గౌరవం దక్కడం లేదని కళాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేములవాడ ప్రాంతంలోని కళాకారుల ప్రతిభను గుర్తించేందుకు, కళా ప్రదర్శనలు ఇచ్చేందుకు నిర్మించిన సినారె కళా మందిరం దయనీయస్థితిలో దర్శనమిస్తోంది. వేములవాడ మండల పరిషత్ ఆవరణలో నిర్మించిన సినారె కళామందిర్ ఎంపీడీవో ఆధ్వర్యంలో కొనసాగుతుండేది. ఎన్నో ఏళ్లుగా సినారె కళామందిర్ ఆలనాపాలన లేకపోవడంతో శిథిలావస్థకు చేరకుంది. వేములవాడ మున్సిపల్ కార్యాలయంలోని వాహనాలకు, ఆటోలకు అడ్డాగా మారింది. సినారె కళామందిర్ చెత్తాచెదారంతో నిండిపోయింది. వెంటిలేటర్లు పూర్తిగా పగిలిపోయి దర్శనమిస్తున్నాయి. అసాంఘిక కార్యకలాపాలు, మందుబాబులకు అడ్డాగా మారడంతో వాడిపడేసిన మందుబాటిళ్లు, గ్లాసులు, పేపర్ ప్లేట్లతో దుర్వాసన వస్తోందని కళాకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిధులు మంజూరైనా..

కళామందిర్ నూతన భవన నిర్మాణం చేపట్టేందుకు గత ప్రభుత్వం హయాంలో అప్పటి ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్‌బాబు ఆధ్వర్యంలో టీయూఎఫ్ఐడీ నిధులు రూ.5కోట్ల మంజూరైనట్లు ప్రకటించారు. అయితే నూతన భవన నిర్మాణానికి రూ.5 కోట్ల నిధులు సరిపోవని కాంట్రాక్టరులు ఎవరు ముందుకు రాకపోవడంతో మంజూరైన నిధులను ఇతర అభివృద్ధి పనులకు మళ్లించారనే ఆరోపణలు ఉన్నాయి.



చెత్తచెదారంతో అధ్వానంగా మారిన సినారె కళామందిర్

ప్రభుత్వంపై ఆశలు..

డాక్టర్ సింగిరెడ్డి నారాయణరెడ్డి రాజ్యసభ సభ్యుడిగా ఉన్న సమయంలో 2005లో 'సినారె కళా మందిర్'ను నిర్మించారు. సినారె పేరు చిరకాలం గుర్తిండిపోయేలా అప్పట్లోనే సకల హంగులతో కళామందిర్ నిర్మాణం చేపట్టారు. ఈప్రాంత కవులు, కళాకారులు, సాహితీవేత్తలతో పాటుగా సమస్త కళాకారుల ప్రతిభను గుర్తించి అన్ని స్థాయిల్లో రాణించాలనే ఆకాంక్షతోనే కళామందిర్ నిర్మించారు. అయితే గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో సినారె భవనాన్ని పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు అవుతున్న సినారె కళామందిర్‌ను పట్టించుకోవడం లేదని కళాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవ తీసుకుని నూతన భవన నిర్మాణం చేపట్టాలని కళాకారులు, కవులు కోరుతున్నారు.

ప్రభుత్వంపైనే ఆశలు..

- వారాల దేవయ్య, ఉద్యమ కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు



గత ప్రభుత్వ పదేళ్ల పాలనలో సినారె భవనాన్ని పట్టించుకోలేదు. ప్రస్తుత ప్రభుత్వం చొరవ తీసుకుని సినారె భవనానికి నిధులు మంజూరు చేసి నూతనంగా నిర్మాణం చేయాలి. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చొరవ తీసుకొని కళామందిర్‌కు పూర్వవైభవం తీసుకురావాలని కోరుతున్నాం.

శ్రీరాంసాగర్‌కు 9,454 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

జగిత్యాల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఆదివారం స్వల్పంగా వరద వచ్చింది. ఎగువ ప్రాంతం నుంచి 9,454 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా కాకతీయ కాలువ, సరస్వతీ కాలువ, మిషన్ భగీరథ, వరద కాలువ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 9,454 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి వంద క్యూసెక్కుల నీటి విడుదల

ఇల్లంతకుంట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.41టీఎంసీల నీరు ఉంది. అన్నపూర్ణ రిజర్వాయర్ సర్‌ప్లస్ గేట్ల ద్వారా 100క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీలకు ఎంపిక



ప్రహర్షిక

మానకొండూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీలకు మండలంలోని పోచంపల్లి ఆదర్శ పాఠశాలకు చెందిన ప్రహర్షిక ఎంపికైంది. ఈ నెల 3న హుజూరాబాద్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్-14 బాలికల విభాగంలో ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలో ప్రతిభ కనబరిచింది.

పెద్దపల్లిలో ముగిసిన రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు

పెద్దపల్లి కల్చరల్, నవంబరు9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మూడు రోజుల పాటు జరిగిన 58వ రాష్ట్ర సీనియర్ ఇంటర్ జిల్లా ఖోఖో చాంపియన్ షిప్ పోటీలు ఆదివారం ముగిసాయి. ఈ పోటీలను జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఖోఖో అసోసియేషన్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ, తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి వచ్చిన మహిళలు, పురుష జట్లు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. విజేతలకు ట్రోఫీలు, సర్టిఫికెట్లు నిర్వాహకులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఇంత పెద్దస్థాయి పోటీలు పెద్దపల్లిలో నిర్వహించడం, విజయవంతంగా జరగడం సంతోషదాయకమన్నారు.

17న ఛలో ఢిల్లీకి తరలిరండి

కథలాపూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన ప్రధాన న్యాయ మూర్తి గవాయ్‌పై దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోకపోవడాన్ని నిరసిస్తూ ఈ నెల 17 నిర్వహించనున్న దళితులు ఆత్మగౌరవ సభ ఛలో ఢిల్లీకి తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి కాశవత్తు లక్ష్మీరాజం కోరారు. ఆదివారం కథలాపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ దాడి జరిగి దాదాపు నెల రోజులు కావస్తున్నా నేటికీ ఈ కేసును సుమోటోగా స్వీకరించక పోవడం దారుణమని అన్నారు. మేధావులు, దళిత సంఘాలు, పార్టీలకతీతంగా నాయ కులు సభకు హాజరై విజయవంతం చేయా లని కోరారు. ఈ సందర్భంగా గజ్జెల దశరథం, నితిన్, కిరణ్, ప్రభు, నవదీప్, సాయి, భూమేశ్ తదితరులు ఉన్నారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోండి..



● నేడు ప్రపంచ రోగ నిరోధక దినోత్సవం

సుభాష్‌నగర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): టీకాల ప్రాధాన్యంపై అవగాహన పెంచడానికి ప్రపంచ రోగ నిరోధక దినోత్సవాన్ని పాటిస్తున్నారు. వ్యాధిని నివారించడలో, ప్రజారోగ్యాన్ని పరిరక్షించడంలో టీకాల ప్రాధాన్యం ఎంతగానో ఉంది. తీవ్రమైన అనారోగ్యం, వైకల్యం, మరణానికి కారణమయ్యే అంటువ్యాధులను నివారించడం ద్వారా టీకాలు వేస్తారు.

● రోగ నిరోధకతకు ప్రాధాన్యం

శరీర రోగనిరోధక వ్యవస్థను మెరుగు పరచడానికి టీకాలు ఉపయోగపడతాయి. ఇవి వ్యాధుల నుంచి రక్షణ అందిస్తాయి. వ్యాక్సిన్ల అభివృద్ధి ఆరోగ్య సంరక్షణలో కీలకంగా మారింది. సకాలంలో టీకాలు తీసుకోవడం వల్ల వ్యాధులు వ్యాప్తిచెందకుండా నిరోధించవచ్చని డాక్టర్లు సూచిస్తున్నారు. కొవిడ్-19 మహమ్మారి వంటి కొత్త ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్న తరుణంలో సమగ్ర టీకా కార్యక్రమాల అవసరం గతంలో కంటే పెరిగింది. చిన్నపిల్లలకు సాధారణ టీకాలతో పాటు బూస్టర్ మోతాదులు, పెద్దలకు టీకాలు, రోగాల నుంచి రక్షించడానికి సహాయపడతాయి.

● వ్యాక్సిన్- నివారించగల వ్యాధులు

మన దేశంలో టీకాలతో నివారించగల వ్యాధులు ఎక్కువగా ఉన్నాయి. అందులో పోలియో ఒకటి. 2014లో విస్తృత ప్రయత్నాల ద్వారా పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంతో నేడు భారత దేశం పోలియో రహిత దేశంగా ప్రకటించబడింది. లక్షలాది మందిని ప్రభావితం చేస్తున్న హెపటైటిస్-బి ఒక సవాల్‌గా మారింది. హెపటైటీస్ వ్యాక్సిన్ వేయించడం వల్ల ఈ వ్యాధి తగ్గుముఖం పడుతుంది. డిఫ్తీరియా అనేది తీవ్రమైన బాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్. ఇది శ్వాసకోశ వైఫల్యం, ఒక్కోసారి ప్రాణాంతకంగా మారుతుంది. దీనిని నివారించడానికి డీటీపీ (డిఫ్తీరియా, టెటనస్, పెర్టుసిస్) టీకాలు వేస్తున్నారు. ధనుర్వాతం ఆందోళనకరమైంది. ఇన్‌ఫెక్షన్లు ఎక్కువగా ఉండే గ్రామీణ ప్రాంతాలు, నవజాత శిశువులు, ధనుర్వాతానికి దారి తీసే గాయాలతో బాధపడుతున్న వ్యక్తులకు టీకాలు వేయడం చాలా అవసరమని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. క్షయవాది (టీబీ)కి బీసీజీ వ్యాక్సిన్ ఉన్నది.

ఆలయాల్లో భక్తుల కార్తీక పూజలు



వేములవాడ రాజరాజేశ్వరాలయంలో భక్తులు



రావిచెట్టు వద్ద కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

వేములవాడ టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో భక్తజన సందడి నెలకొంది. కార్తీకమాసం సందర్భంగా రెండు రోజులు సెలవు రావడంతో ఆదివారం వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. ముందుగా రాజరాజేశ్వరస్వామి వారిని భక్తులు లఘు దర్శనం చేసుకున్నారు. అనంతరం భీమేశ్వరాలయంలో భక్తులు కోడెల మొక్కులు చెల్లించి అన్నపూజ, అభిషేకం పూజలు చేశారు. నిత్యాన్నదాన సత్రంపై నిత్యకళ్యాణం, సత్యనారాయణ వ్రతాలు చేయించుకున్నారు. దీంతో రాజరాజేశ్వరాలయం, భీమేశ్వరాలయంలో భక్త జనసంద్రమైంది.

బద్దిపోచమ్మకు బోనాలు

రాజన్న సన్నిధిలో స్వామివారి దర్శించుకున్న భక్తులు బద్దిపోచమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆదివారం బద్దిపోచమ్మ ఆలయంలో అమ్మవారికి బోనం మొక్కులు చెల్లించేందుకు బారులుతీరారు. ఆలయంలో వేలాదిమంది భక్తులతో రద్దీ ఏర్పడింది.

కార్తీక దీపాలు వెలిగించిన భక్తులు

వేములవాడ రాజరాజేశ్వరాలయం ఆవరణలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయ ఎదురుగా ఉన్న రావిచెట్టు వద్ద భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించారు. మరోవైపు భీమేశ్వరాలయంలోనూ భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయంలో కార్తీక దీపోత్సవంలో భాగంగా సుహాసినులు దీపాలు వెలిగించారు.

ధర్మపురి క్షేత్రంలో...

ధర్మపురి : కార్తీక మాసం సందర్భంగా ధర్మపురి క్షేత్రంలో ఆదివారం భక్త జన సందడి నెలకొంది. దీంతో క్షేత్రంలోని లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు క్యూలైన్‌లో నిలబడి స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. ఆలయం ఆవరణలో గల ఉసిరిక చెట్టు చుట్టు ప్రదక్షిణలు చేసి కార్తీక దామోదరుడిని పూజించారు. మహిళలు దీపాలు, వత్తులు వెలిగించి భక్తిశ్రద్ధలతో పూజించారు. ఆలయం పక్షాన ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, అర్చకులు, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు.

● కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో గోదావరి హారతి 19వ రోజు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



ధర్మపురిలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీడీ వర్కర్స్ నాయకులు

మెట్‌పల్లి టౌన్, నవంబరు9(ఆంధ్రజ్యోతి): దేశాయి బ్రదర్స్ బీడీ కంపెనీ కార్మికులపై కొనసాగుతున్న అన్యాయాలను ఖండిస్తూ రాష్ట్ర ప్రగతిశీల వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానికంగా పలువురు కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కంపెనీ ఎదుట యూనియన్ నాయకులు పోస్టర్లను ఆవిష్కరించారు. కంపెనీ ప్రతి వెయ్యి బీడీలకు రూ.10 చెల్లించడం చట్ట వ్యతిరేకమని, ఈ మొత్తం వెంటనే కార్మికులకు తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నేతలు సత్తక్క, రాధక్క, వినీత, శ్యామల, బాలయ్య, సునీతతోపాటు పలువురు బీడి కార్మికులు పాల్గొన్నారు. వీరి నిరసనకు స్థానిక ప్రజలు మద్దతు తెలపడం విశేషం.

రాజన్న క్షేత్రంలో సినీనటుల మొక్కులు



రాజన్నను దర్శించుకున్న సినీ నటులు రవి, రామ్మోహన్

వేములవాడ టౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీక మాసం సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం సినీ నటులు రచ్చ రవి, రామ్మోహన్‌లు స్వామివారిని దర్శించుకున్నారు. దర్శకులు బోయపాటి శ్రీను అఖండ-2 చిత్రంలో నటిస్తున్న రచ్చ రవి, రామ్మోహన్ దంపతులు, వారాల దేవయ్యలు భీమన్నను దర్శించుకొని మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా వీరికి ఆలయ అర్చకులు స్వామివారి ప్రసాదం అందజేశారు.

గురుదేవోభవ నేషనల్ అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న స్వరాజ్యలక్ష్మి

చందుర్తి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండలం తిమ్మాపూర్ ఎంపీపీఎస్‌కు చెందిన ఉపాధ్యాయురాలు స్వరాజ్యలక్ష్మి గురుదేవోభవ నేషనల్ అవార్డును ఆదివారం అందుకున్నారు. హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం 5అక్టోబరు 2025కు సంబంధించిన అవార్డును హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ చేతుల మీదుగా అందుకున్నారు. అవార్డు అందుకున్న రాజ్యలక్ష్మిని మండలంలోని ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభినందించారు.

ధర్మపురిలో వైభవంగా గోదావరి మహా హారతి



గోదావరి నది వద్ద మహాహారతి పూజలు

ధర్మపురి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో గోదావరి మహాహారతి కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ధర్మపురి క్షేత్రంలో 14వ సారి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి భాగ్యనగర్ బర్దీపూర్ శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమ పీఠాధిపతులు అవధూతగిరి మహారాజ్, పీఠాధిపతులు మహామండలేశ్వర్ డాక్టర్ సిద్దేశ్వరానందగిరి మహారాజ్, గోదావరి మహా హారతి ఉత్సవ సమితి వ్యవస్థాపక చైర్మన్ పోల్సాని మురళీధర్‌రావు వేద పండితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోదావరి నదికి పూజలు నిర్వహించారు. మహిళలు, యువతులు, విద్యార్థినులు దీపాలను నదిలో వదిలారు. భక్తులు హారతి కార్యక్రమాన్ని తిలకించారు. అంతకు ముందు దత్తగిరి మహారాజ్ ఆశ్రమ పీఠాధిపతులు అవధూతగిరి మహారాజ్, సిద్దేశ్వరానందగిరి మహారాజ్, పోల్సానీ మురళీధర్‌రావు నదుల ఆరాధన ద్వారా లభించే సత్ఫలితాలు, హిందుత్వం, ధర్మ పరిరక్షణ, ప్రాచీన సంస్కృతి గురించి ధార్మిక ప్రసంగం చేశారు. రిటైర్డ్ డీఈఈ రతన్‌లాల్ ఆధ్వర్యంలో చిన్నారులచే నిర్వహించబడిన పేరిణి, ఆంధ్ర నాట్యం ఎంతో ఆకట్టుకుంది. కార్యక్రమంలో గోదావరి హారతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగంపెల్లి వీరగోపాల్, దామెర రాంసుధాకర్‌రావు, బల్లూరి సంతోష్‌రావు, క్యాతం వెంకటరమణ, పాపారావు, సాయిరెడ్డి, పెండ్యాల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారుల నృత్య ప్రదర్శన

కార్యవర్గం ఎన్నిక

ఎల్లారెడ్డిపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ ఎల్లారెడ్డిపేట మండల శాఖ కార్యవర్గం సమావేశం మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగింది. అధ్యక్షుడిగా గుగులోతు రమేశ్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా సురేందర్, శైలజలను ఎన్నికయ్యారు. రాష్ట్ర కౌన్సిలర్లుగా భరత్, శ్రీనివాసశర్మలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణప్రసాద్‌గౌడ్ మాట్లాడుతూ పెండింగ్‌లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని అన్నారు. 2010 కంటే ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయించాలని అన్నారు. సమావేశంలో ఆ సంఘం సభ్యులు రమేశ్, వినయ్‌కుమార్, రమేశ్, శ్రీనివాస్, రాధకిషన్, వెంకటేశ్వర్‌రావు, రాములు, ప్రకాశ్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

బోరు మోటార్ ప్రారంభం

తంగళ్లపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామంలో రూ. 2లక్షల ఎస్డీఎఫ్ నిధులతో ఏర్పాటు చేసిన బోరు మోటర్‌ను మార్కెట్ కమిటి డైరెక్టర్ ఆరెపల్లి బాలు ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పబ్బ ముత్తయ్య, నల్లగొండ లక్ష్మీరాజం, గడ్డం అజయ్, తక్కల్ల ప్రశాంత్, నందగిరి అంజనేయులు, మైలారపు రఘు, బుర్ర వినయ్, అట్టెల చందు, తక్కళ్ల అంజనేయులు, నాగరాజు, కిట్టు, నవీన్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే చింతే..

- రాంనగర్ కాలనీ వాసుల కష్టాలు..
- వరద నీటితో తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

తంగళ్లపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): చినుకు పడితే ఇళ్లలోకి చేరుతున్న నీరు.. చిన్నపాటి వర్షానికే రాంనగర్ కాలనీలో ఇళ్ల చుట్టూ నీరు చేరి చెరువును తలపిస్తోంది. వర్షాకాలం వచ్చిందంటే ప్రాణాలు అర చేతిలో పెట్టుకుని కాలం వెల్లదీస్తున్నారు కాలనీవాసులు. తంగళ్లపల్లి మండల కేంద్రంలో రాంనగర్ కాలనీ వాసులకు వర్షాకాలం కష్టాలు తప్పడం లేదు. చిన్నపాటి వర్షం పడితే కాలనీలోకి వరద నీరు చేరుతోంది. దీంతో కాలనీలో సుమారు 25 ఇళ్లు నీటిలో ఉండాల్సిన పరిస్థితి నెలకోంది. ఇంటినుంచి కాలు బయట పెట్టాలంటే భయపడుతున్నారు.



రాంనగర్ కాలనీలో వరద నీరు



వరద నీటిలో మునిగిన ఇళ్లు..

ప్రధాన రోడ్డు నిర్మణంతో వచ్చిన కష్టాలు..

సిరిసిల్ల-సిద్దిపేట ప్రధాన రహదారి విస్తరించినప్పటి నుంచి కాలనీవాసులకు కష్టాలు మొదలయ్యాయి. రోడ్డు నిర్మాణంలో భాగంగా రోడ్డును సుమారు మీటరు ఎత్తుపైకి లేపి అదే సమానంగా ప్రధాన డ్రైనేజీ నిర్మాణం చేపట్టారు. దీంతో వర్షపు నీరు, మురుగునీరు నిలిచిపోయి కాలనీ వాసులు కష్టాలు ఎదుర్కొంటున్నారు.

వర్షం నీటితో పాటు మురుగు నీరు ఇళ్లలోకి..

వర్షం కురిసినప్పుడు వర్షం నీటితో పాటు మురుగు నీరు ఇళ్లలోకి వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షం వస్తే ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. వర్షం తగ్గిన వారంరోజుల వరకు నీటి నిల్వలు అలాగే ఉంటున్నాయని తెలిపారు.

నీరు నిల్వడంతో రోగాల బారిన ప్రజలు..

వరద నీరు, మురుగునీరు ఇళ్ల చుట్టూ నిల్వడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. మురుగు నీరు నిల్వడంతో దోమలు అభివృద్ధి చెందుతున్నాయి. వెరసి ప్రజలు విష జ్వరాల బారిన పడుతూ సంపాదన అంతా ఆసుపత్రులకు, మందులకు ఖర్చు చేయాల్సి వస్తోందని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

దోమలతో జ్వరాల బారిన పడుతున్నాం..

- వంగ సత్తయ్య, రాంనగర్ వాసి



దోమలతో సహవాసం చేస్తూ తరచూ జ్వరాల బారిన పడుతున్నాం. అప్పుడప్పుడు గ్రామ పంచాయతీ సిబ్బంది దోమల నివారణకు మందు చల్లుతున్నారు. శాశ్వత పరిష్కారం చూపెట్టాలి.

కాలనీ పరిస్థితి దృష్టికి వచ్చింది..

-మీర్జా, ప్రత్యేకాధికారి, తంగళ్లపల్లి గ్రామ పంచాయతీ



రాంనగర్ కలానీ పరిస్థితి దృష్టికి వచ్చింది. లోతట్టు ప్రాంతం కావడం ప్రధాన రోడ్డు ఎత్తు పెరగడంతో పరిస్థితి నెలకోంది. శాశ్వత పరిష్కారం కోసం ఉన్నాతాధికారులకు నివేదించి పరిష్కారిస్తాం.

17న దళితుల ఆత్మగౌరవ ప్రదర్శన



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ రాకేష్

ఇల్లంతకుంట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : దళితుల ఆత్మగౌరవ ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ సావనపెల్లి రాకేష్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆదివారం మండలశాఖ అధ్యక్షుడు మంద రాజుమాదిగ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి దళితుడు కావడం వల్లనే దాడి జరిగిందన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ నేతృత్వంలో ఈనెల 17న ఢిల్లీలో జరిగే ప్రదర్శనలో అందురు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాజకీయాలకు అతీతంగా ఆదివారం నిర్వహించదలచిన రౌండ్‌టేబుల్ సమావేశం అనివార్య కారణాల వల్ల వాయిదా వేయడం జరిగిందన్నారు. సమావేశంలో ఎంఎస్‌పీ జిల్లా అధికార ప్రతినిధి గుండ్రెడ్డి రాజు, ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షుడు కాసుపాక సురేష్, ప్రధాన కార్యదర్శి సావనపెల్లి శంకర్, నాయకులు బడుగు లింగం, సంపతి కొమురయ్య, తడ్కపెల్లి రాములు, ఎర్ర దేవరాజు, సావనపెల్లి ప్రభాకర్, కొమ్ముల మహేష్, బోయిని మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు పూర్తయిన మంగళపల్లె తారురోడ్డు

కోనరావుపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : దశాబ్దాల నిరీక్షణకు మంగళపల్లి గ్రామానికి మోక్షం లభించింది. మంగళపల్లె తారు రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో ప్రజల కష్టాలు తీరాయి. కోనరావుపేట మండలం మంగళపల్లి గ్రామానికి తారు రోడ్డు లేక గత 30 సంవత్సరాలుగా ఆ గ్రామ రైతులు, వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వాలు మారినా ఆ రోడ్డు నిర్మాణం ఎవరూ చేపట్టలేదు. జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అప్పటి అభ్యర్థి ఆది శ్రీనివాస్ ఎన్నికల ముందు తారు రోడ్డు, కల్వర్టులు నేను గెలిస్తే పూర్తిచేస్తానని హామీ ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిచిన 15 నెలల వరకే నిధులు మంజూరు చేసి తారు రోడ్డు నిర్మాణం, కల్వర్టు పనులు పూర్తి చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంగళపల్లె గ్రామంలో 130 కుటుంబాలు ఉంటాయి. ఇక్కడ రైతులు వ్యవసాయంపై ఆధారపడి పూలు, కూరగాయలు, పత్తి, మిర్చి పండిస్తూ పట్టణాలకు తరలిస్తారు. ఈ గ్రామానికి రోడ్డు బాగా లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



నిర్మాణం పూర్తయిన మంగళపల్లి తారు రోడ్డు

ఎమ్మెల్యే ప్రోత్సాహంతోనే రోడ్డు పనులు పూర్తి

- సౌండెసారి రవి, మంగళపల్లి



ఎమ్మెల్యే ఆదిశ్రీనివాస్ ఎన్నికల ముందు మాట ఇచ్చి గెలిచిన తర్వాత నిధులు మంజూరుచేసి తారు రోడ్డు నిర్మాణం పూర్తి చేయించాడు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు రుణపడి ఉంటాం.

రోడ్డు పూర్తి కావడంతో కష్టాలు తీరాయి..

- ఆవురం లత, మంగళపల్లి



గత 30ఏళ్లుగా రోడ్డు లేక ఇబ్బందులు పడ్డాం. తారురోడ్డు నిర్మాణం పూర్తికావడంతో ప్రజల కష్టాలు తీరాయి. రోడ్డు పూర్తికావడంతో సుద్దాల ఎక్స్‌రోడ్డు నుంచి వేములవాడ వరకు సులభంగా వెళ్తున్నాం.

నిరుపేద దంపతుల వైద్యానికి ఆర్థిక సాయం

ఎల్లారెడ్డిపేట, నవంబరు9(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామంలో అనారోగ్యంతో బాధ పడుతున్న నిరుపేద దంపతులు లత- రవిల వైద్యానికి సింగారంలోని హెల్పింగ్ హాండ్స్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ఆదివారం రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆ దంపతుల దీన స్థితిని చూసి సభ్యులు నగదును అందించేందుకు ముందుకు వచ్చారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం ఆ పేద దంపతులకు మెరుగైన వైద్యం అందించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు నాగరాజు, సభ్యులు రాజు, దేవయ్య, బాలనర్సు, నవీన్, సురేశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షుడిగా తిరుపతి



తిరుపతి

ఇల్లంతకుంట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : శ్రీశ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షుడి గా తునికి తిరుపతిని నియమిస్తున్నట్లు ఛైర్మన్ కత్తిమండ ప్రతాప్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని ముస్కానిపేట గ్రామానికి చెందిన తిరుపతి కళారంగంపై మక్కువతో అనేక ప్రదర్శనలు ఇచ్చారు. కవి, రచయితగా పలువురి మన్ననలు పొందాడు. ఈసందర్భంగా తన నియామకానికి సహకరించిన ఈశ్వరి భూషణంతో పాటు కళాకారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రమాదకరంగా ఆర్‌డబ్ల్యూఎస్ భవన్



పగుళ్లతో ప్రమాదకరంగా కనిపిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ భవనం

వేములవాడ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండల పరిషత్ ఆవరణలో నిర్మించిన డివిజనల్ ఆర్‌డబ్ల్యూఎస్ భవన్ ప్రమాదకరంగా మారింది. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించడంతో పగుళ్లు బారి పెచ్చులూడుతోంది. వేములవాడ డివిజన్ పరిధిలోని ఆరు మండలాలకు సంబంధించి ఉపకార్యనిర్వాహక ఇంజనీర్ కార్యాలయంతో పాటుగా మిషన్ భగీరథ ఇంట్రా ఉప విభాగం సైతం అందులోనే కొనసాగడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆయా మండలాల్లోని ప్రజలకు సేవలందించేందుకు ఏర్పాటు చేసిన భవనం చిన్నపాటి వర్షానికి ఊరుస్తుందని కార్యాలయ సిబ్బంది చెబుతున్నారు.ఇప్పటికైనా నూతన భవనం నిర్మాణం చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

వేములవాడ టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వేములవాడ అర్బన్ మండలంలోని ఆరెపల్లి గ్రామ శివారులో గల ఇస్కాన్ ఆలయం వద్ద శ్రీ బలరామ సుభద్ర జగన్నాథ స్వామి విగ్రహాన్ని ఆదివారం రాజమండ్రిలోని ఇస్కాన్ ఆలయ ప్రతినిధులు సత్యగోపినాథ్ ప్రభు, శ్యామల శ్రీనివాస్‌లు ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుదర్శనయజ్ఞం, అభిషేకం, పుణ్యవచనం పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు గజవాడ గణేష్, కంటాల వేణు, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు బుస్స దశరథం, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ అల్లాడి రమేశ్, భక్తులు పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్ఠ చేస్తున్న ఇస్కాన్ ప్రతినిధులు

ధాన్యం ఆరబోతకు స్థలం కొరత..

- కల్లాలు లేక కష్టాలు.. - రహదారులపైనే ఆరబోత.. - వాహదారులకు ఇబ్బందులు



చందుర్తి-మోత్కురావుపేట దారిలో ధాన్యం రాశులు



చందుర్తిలో పాఠశాల ఎదుట ఆరబెట్టిన ధాన్యం

చందుర్తి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండల కేంద్రంతో పాటు మల్యాల, ఆశిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో ధాన్యం ఆరబోసేందుకు రైతులు నానా కష్టాలు పడుతున్నారు. పంట పొలాల్లో కల్లాలకు స్థలాలు లేక ఈ ప్రాంతానికి చెందిన రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మండలంలో వరి పంట ఈ సీజన్‌లో 15,200 ఎకరాలో సాగు చేశారు. కల్లాలకు పంట పొలాల మధ్యలో ఖాళీ స్థలాలు ఉండని పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు యంత్రాలతో వరి పంటను కోయించి ధాన్యాన్ని ట్రాక్టర్ ట్రాలీలో లోడింగ్ చేసి ప్రధాన రహదారులపైన ఆరబోస్తున్నారు. ఇలా మండలంలోని చందుర్తి, మల్యాల, మర్రిగడ్డ తదితర గ్రామాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే పత్తి రైతులు కూడా కల్లాలు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ వానాకాలం సీజన్లో ధాన్యాన్ని అమ్ముకోవాలంటే తేమ శాతం తగ్గాలి. అప్పుడే నాణ్యాత ప్రమాణాలు సరిగ్గా ఉంటే ఆయా రైతులు ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు జరుగుతాయి. వరి పండించే రైతులు దిగుబడి వచ్చిన ధాన్యాన్ని తేమ శాతం తగ్గేలా కనీసం వారం రోజులకు పైగా ఆరబోయాల్సి ఉంటుంది. ఈ పరిస్థితుల్లో మండల కేంద్రంలోని రైతులు చందుర్తి నుంచి మోత్కరావుపేట వెళ్లే రహదారిపై సుమారు 4 కిలోమీటర్ల పొడవునా, మల్యాల రైతులు కోరుట్ల-వేములవాడ ప్రధాన రహదారిపై ధాన్యంను ఆరబోసి రాసులుగా పోస్తున్నారు. ఇలా నవంబరు నెల నుంచి డిసెంబరు నెల వరకు రెండు నెలల పాటుగా ప్రధాన రహదారులపై తేమశాతం తగ్గేలా తమ ధాన్యాన్ని రైతులు ఆరబోస్తారు. ఈ సమయంలో వాహనాల రాకపోకలతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికే ఈ రహదారులపై ఆరబోసిన ధాన్యాన్ని ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు ఢీకొని ఇద్దరు మృతిచెందగా, పలువురు గాయపడి ఆసుపత్రుల పాలయ్యారు. గతంలో ఈజీఎస్ పథకం నిధులతో కల్లాలు నిర్మించారు. ఈ పథకం ప్రస్తుతం అధికారులు నిలివేశారు. దీంతో కల్లాల నిర్మాణాన్ని ముందుకు తీసుకవెళ్లలేని పరిస్థితి నెలకొన్నది. ఇప్పటికైనా ప్రభుత్వం తరపున రైతుల పంట పొలాల సమీపంలోగల ఖాళీ స్థలాల్లో కల్లాలు నిర్మించేలా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ప్రభుత్వం స్థలం కేటాయించాలి..

చిలుక పెంటయ్య, రైతు సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు



గ్రామాల్లో రైతులు ధాన్యం ఆరబెట్టిందుకు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లోని ప్రభుత్వ భూములను అధికారులు గుర్తించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. ప్రభుత్వ భూముల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం సేకరించాలి. ధాన్యం ఆరబోతతో రహదారులపై ప్రమాదాలు జరుగకుండా నివారించేందుకు స్థలాలు కేటాయించాలి.

కొనుగోలు కేంద్రాల్లో రైతుల పడిగాపులు

- ధాన్యం తరలింపులో జాప్యం - పట్టించుకోని అధికారులు

వేములవాడ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువచ్చిన రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అయినా అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని రైతులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. మొంథా తుఫాన్ ధాటికి ధాన్యం తడిసి కొందరు రైతులు ఆర్థికంగా ఇబ్బందుల పాలయ్యారు. మరికొందరు ధాన్యం వర్షానికి తడవకుండా కంటికి రెప్పలా కాపాడుకుని కొనుగోలు కేంద్రాలకు తరలించారు. అయినా కొనుగోలులో ఆలస్యం కావడంతో రైతులు దిక్కుతోచక సతమతమవు తున్నారు. వేములవాడ డివిజన్ పరిధిలో 86 కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు వేగంగా జరుగుతున్నాయి. అయితే వాటికి అనుగుణంగా మిల్లుల అలాట్ మెంట్ లేకపోవడంతో ధాన్యం కొనుగోళ్లలో ఆలస్యమవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. డివిజన్ పరిధిలో మొత్తం 34 మిల్లులు ఉండగా, 8 మిల్లుల కు మాత్రమే అనుమతి ఇచ్చినట్లు సివిల్ సప్లై అధికారులు తెలిపారు.

కాగా, వేములవాడ ప్యాక్స్ ఆధ్వర్యంలో గత సీజన్‌లో లక్షా 90 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయగా, ప్రస్తుతం దాదాపు 25వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. నాంపల్లి ప్యాక్స్ ఆధ్వర్యంలో గత సీజన్‌లో 20 వేల 900 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయగా, ఈసారి 4వేల క్వింటాళ్ల వరకు ధాన్యం కొనుగోలు చేశారు. ధాన్యం కొనుగోళ్లు వేగంగా జరుగుతున్నప్పటికి మిల్లులు ఎక్కువగా కేటాయించకపోవడంతో ధాన్యం దించుకునేందుకు మిల్లు వద్ద లారీలు క్యూలైన్‌లో పెట్టి పడిగాపులు కాస్తున్నట్లు తెలుస్తోంది. త్వరగా మిల్లుల్లో ధాన్యం దించుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, మరిన్ని మిల్లులు కేటాయించాలని పలువురు కోరుతున్నారు.



వేములవాడలో ధాన్యం ఆరబెడుతున్న మహిళా రైతు

అనుమతి 8 మిల్లులకే..

వేములవాడ డివిజన్ పరిధిలో మొత్తం 34 మిల్లులు ఉన్నాయి. అయితే ధాన్యం సేకరణ కోసం సివిల్ సప్లై అధికారులు 8మిల్లులు కేటాయించారు. వేములవాడ మండలం హన్మక్కపల్లిలో ఒక మిల్లు, వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లిలో ఒక మిల్లు, బోయినపల్లి మండలంలోని విలాసాగర్‌లో 3 మిల్లులు, కొనరావుపేట మండలానికి 3 మిల్లులకు అనుమతి ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. కొన్ని మిల్లుల నిర్వాకులకు బ్యాంకు గ్యారంటీ లేకపోవడంతో అలాట్‌మెంట్ ఇవ్వలేదని, మరికొన్ని మిల్లుల నిర్వాకులు గత సంవత్సరం సీఎంఆర్ తిరిగి అప్పగించకపోవడంతో ధాన్యం సేకరించేందుకు అనుమతులు ఇవ్వలేదని తెలుస్తోంది. సీఎంఆర్ 2024-25 సంవత్సరానికి గడువు తేదిలోగా తగిన ధాన్యం అప్పగించకపోవడంతో ఈనెల 12వ తేది వరకు గడువు ఇచ్చారని, గడువు తేదిన సీఎంఆర్ అప్పగిస్తే అనుమతి ఇవ్వనున్నట్లు అధికారులు చెబుతున్నారు. మరికొన్ని మిల్లుల అనుమతి తీసుకుని కొనుగోళ్లను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని రైతులు చెబుతున్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి..

- దేవెందర్‌రెడ్డి, రైతు వేములవాడ

తుఫాన్‌కు ముందు ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చాను. టార్పాలిన్ కవర్లు కప్పినప్పటికి ధాన్యం మెత్తబడి తేమశాతం రావడం లేదు. పక్షం రోజులుగా ఇద్దరం ధాన్యంతో అరిగోసలు పడుతు న్నాం. ఇప్పటికైనా కొనుగోళ్లు వేగవంతం చేయాలి. రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలి.

త్వరలో మరికొన్ని మిల్లులు కేటాయిస్తాం..

- సత్యనారాయణ, సివిల్ సప్లై అధికారి, వేములవాడ

వేములవాడ డివిజన్ పరిధిలో 8 మిల్లులకు ధాన్యం సేకరించేందుకు అనుమతులు ఇచ్చాం. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ఎక్కువ రావడంతో మరికొన్ని మిల్లులకు అతి త్వరలోనే అనమతులు ఇచ్చి రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రభుత్వాలు

- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

భగత్‌నగర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. ఆదివారం నగరంలోని ముకుందలాల్‌మిశ్రా భవన్‌లో జిల్లా 11 మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఏకతాటిపై వచ్చి పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాస్తుందన్నారు. జిల్లాలో సీఐటీయూ కార్మికుల ఉద్యోగుల సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించిందన్నారు. ఈ మూడు సంవత్సరాల కాలంలో కొత్త రంగాలకు మండలాలకు సీఐటీయూ విస్తరించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల కార్మికులకు కనీస వేతనం 26 వేలు, పెండింగ్ జీవోలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి, కార్యదర్శి ఎడ్ల రమేష్, ఉపాధ్యక్షుడు యు శ్రీనివాస్, జనగాం రాయమల్లు, గుడికందుల సత్యం, కొప్పుల శంకర్, మారెళ్ల శ్రీలత, పున్నం రవి, రాజేశం, నాలువాల స్వామి పాల్గొన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధానకార్యదర్శి పాలడుగు భాస్కర్

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌దే విజయం

కథలాపూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్ విజయం తథ్యమని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లో ప్రచారం చివరి రోజు కావడంతో 75వ బూత్‌లో విస్తృత పర్యటన చేసిన అనంతరం కాంగ్రెస్ శ్రేణులతో కలిసి సమీక్ష నిర్వహించారు. జూబ్లీహిల్స్ ప్రజానీకం కాంగ్రెస్ అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధికి పట్టం కట్టబోతున్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజాపాలన రెండేళ్లలో ఎంతో ప్రగతి పథంలో కొనసాగుతున్న విషయాన్ని ఇంటింటికీ ఓటర్లకు వివరించామన్నారు. ఈ సందర్భంగా పీసీసీ కార్యవర్గ సభ్యులు తొట్ల అంజయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, బైర దేవ్ యాదవ్, జిల్లా కార్యదర్శి ధనుంజయ్‌రెడ్డి, న్యావనంది శేఖర్, అల్లకొండ లింగం గౌడ్ తదితరులు ఉన్నారు.

జిల్లాస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు స్పందన



షాట్‌పుట్ విసురుతున్న క్రీడాకారుడు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు విశేష స్పందన లభించింది. ఆదివారం జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన ఈ పోటీలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 160 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ పోటీలను రామగుండం అడిషనల్ సీపీ(అడ్మిన్) శ్రీనివాస్ ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో మానసిక అభివృద్ధి, శారరక పటిష్టం పెంపొందుతుందన్నారు. అనంతరం 30 సంవత్సరాల నుంచి 80 సంవత్సరాల వయస్సు లోపు మహిళలు, పురుషులకు వివిధ వయస్సుల వారీగా వాకింగ్, రన్నింగ్, త్రోస్, జంపింగ్ పోటీలను నిర్వహించారు. ప్రతిభ చాటిన క్రీడాకారులను డిసెంబరు 13, 14 తేదీల్లో కరీంనగర్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక చేశారు. ఈ పోటీలను మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ చాట్ల శ్రీధర్, నీలం లక్ష్మణ్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో దుగ్గు మహేందర్, రాకేష్, పి కిషన్‌రావు, వి లక్ష్మీనారాయణ, వి వెంకటేశ్, జె శిరీష, అమరేందర్, రమేష్ రెడ్డి, కన్నం శ్రీనివాస్, రమణారెడ్డి, రాధమ్మ, పద్మ పాల్గొన్నారు.